
సాక్షి
అనకాపల్లి
సోమవారం, 9, సెప్టెంబర్, 2024



గరిష్ట స్థాయికి జలాశయాలు

రైవాడ జలాశయం నీటిమట్టం ఆదివారం ప్రమాదకర స్థాయికి చేరుకుంది. ప్రస్తుతం 111 మీటర్లకు నీటిమట్టం చేరింది. 8లో

రోడ్డు కోసం బురదలో కూర్చొని నిరసన

తమ గ్రామానికి రోడ్డు సౌకర్యం కల్పించాలని కోరుతూ చింతలపూడి పంచాయతీ శివారు వీరభద్రపేట గిరిజనులు వినూత్న రీతిలో నిరసన తెలిపారు. 8లో



గణనాథుడికి జేజేలు..



చోడవరంలో హరిద్రవర్ణ పసుపు అలంకరణలో స్వయంభూ విఘ్నేశ్వరస్వామి


వక్రతుండ మహాకాయ సూర్యకోటి సమప్రభ నిర్విఘ్నం కురుమే దేవ సర్వ కార్యేషు సర్వదా... ఏకదంతుడు...లంబోదరుడు...విఘ్ననాయకుడు, గణనాథుడు...ఒక్కో పేరు ఒక్కో రూపంలో 'ఘన'నాథుడు కొలువుదీరాడు... వరుణుడు వానజల్లులతో అర్చన చేయగా, భక్తులంతా మోదకప్రియుడికి జేజేలు పలికారు...పూజలు చేశారు... భక్తితో ఉండ్రాళ్లు నివేదన చేశారు. శనివారం వినాయక నవరాత్రి ఉత్సవాలు జిల్లాలో వేడుకగా ప్రారంభమయ్యాయి.




అనకాపల్లి : ఆర్టీసీ కాంప్లెక్స్ రహదారిలో 35 అడుగుల భారీ గణపతి



నర్సీపట్నం వెలమవీధిలో నోట్ల మాలతో వినాయకుడు



అనకాపల్లి : రూపాయి నాణేలతో కనువిందు చేస్తున్న గణనాథుడు



ఒడ్డిమెట్టలో పూజలందుకుంటున్న లంబోదరుడు

న్యూస్‌రీల్

నేడు పీజీఆర్ఎస్ కార్యక్రమం రద్దు

తుమ్మపాల: జిల్లాలో భారీగా కురుస్తున్న వర్షాలకు కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించబోయే ప్రజా సమస్యల పరిష్కార వేదిక-(పీజీఆర్ఎస్) కార్యక్రమాన్ని రద్దు చేస్తున్నట్లు కలెక్టర్ విజయ కృష్ణన్ ఒక ప్రకటనలో తెలిపారు. భారీ వర్షాలతో ప్రజలు రాకపోకలు, ఇతర ఇబ్బందుల దృష్ట్యా నేటి కార్యక్రమం రద్దు అంశాన్ని గమనించాలని కోరారు. తదుపరి త్వరలో జరిగే కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆమె కోరారు.

నేడు పాఠశాలలకు సెలవు

తుమ్మపాల: భారీ వర్షాలు కురుస్తున్న దృష్ట్యా అన్ని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలకు సోమవారం సెలవుదినంగా ప్రకటించడం జరిగిందని కలెక్టర్ విజయ కృష్ణన్ ఒక ప్రకటనలో తెలిపారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు అన్ని పాఠశాల యాజమాన్యాలు సెలువు దినం పాటించాలని, ఎవరైనా ప్రైవేట్ పాఠశాల యాజమాన్యాలు ఉత్తర్వులు అతిక్రమిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. భారీ వర్షాల దృష్ట్యా తల్లిదండ్రులు తమ పిల్లలను బయటకు పంపవద్దని తెలిపారు.

సదరం శిబిరం వాయిదా

అనకాపల్లి: స్థానిక ఎన్టీఆర్ క్రీడామైదానంలో ఈనెల 9న నిర్వహించే 80 శాతం పైబడిన దివ్యాంగుల సదరం మెడికల్ క్యాంపును(ఎన్టీఆర్ భరోసా పింఛను ధ్రువీకరణ) తుఫాను, అకాల వర్షాల కారణంగా రద్దు చేసి, ఈనెల 17వ తేదీ నుంచి యథావిధిగా నిర్వహించడం జరుగుతుందని ఎన్టీఆర్ వైద్యాలయం సూపరింటెండెంట్ డాక్టర్ ఎస్.శ్రీనివాసరావు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. 80 శాతంపైబడి సదరం సర్టిఫికెట్ కలిగిన దివ్యాంగులకు మండలాల వారీగా త్వరలో తేదీలు ప్రకటించడం జరుగుతుందన్నారు.

రేపు జాబ్ మేళా

అనకాపల్లి: నిరుద్యోగులకు ఉద్యోగ కల్పనలో భాగంగా రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో ఈనెల 10వ తేదీన 3 ప్రైవేట్ కంపెనీల ప్రతినిధులతో యలమంచిలి ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఆవరణలో ఉదయం 10 గంటలకు జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు సంస్థ జిల్లా అధికారి టి.చాముండేశ్వరరావు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. పదోతరగతి, ఇంటర్మీడియట్, డిగ్రీ పూర్తి చేసి 18 నుంచి 35 సంవత్సరాల వయస్సు కలిగిన నిరుద్యోగ యువతీ, యువకులు అర్హులన్నారు. మరిన్ని వివరాలకు 8142565416 నంబరును సంప్రదించాలని ఆయన కోరారు.

డెంగ్యూతో ఇంటర్ విద్యార్థిని మృతి



విద్యార్థిని లహరి

మునగపాక: మండలంలోని తోటాడ పంచాయతీకి చెందిన ఇంటర్ విద్యార్థిని దాడి లక్ష్మి లహరి డెంగ్యూతో బాధపడుతూ ఆదివారం మృతి చెందింది. వివరాలివి. తోటాడ పంచాయతీ గవర్ల అనకాపల్లికి చెందిన దాడి అప్పారావు కూలి పని చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. అప్పారావు కుమార్తె లహరి అనకాపల్లిలోని ప్రైవేటు కళాశాలలో ఇంటర్ ప్రథమ సంవత్సరం చదువుతుంది. మూడు రోజులుగా అనారోగ్యంతో బాధపడుతూ విశాఖలోని అపోలో ఆసుపత్రిలో వైద్యం పొందుతోంది. లహరికి ప్లేట్‌లెట్స్ తగ్గిపోవడంతో ఆమె పరిస్థితి ప్రమాదకరంగా మారింది. దీంతో అపోలోలో చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందింది. దీంతో గ్రామంలో విషాదం అలముకుంది. కాగా గ్రామంలో పలువురు జ్వరాలతో బాధపడుతూ స్థానికంగానూ, అనకాపల్లిలో ప్రైవేటు ఆస్పత్రిలో వైద్యం పొందుతున్నారు. అధికారులు స్పందించి గ్రామంలో వైద్య శిబిరం నిర్వహించి జ్వర ప్రమాదాలు జరగకుండా చూడాలని పలువురు కోరుతున్నారు.



భీమ బోయినపాలెంలో నిర్మాణంలో ఉన్న మెడికల్ కళాశాల



కళాశాల ఊహా చిత్రం ..

ప్రభుత్వ వైద్య కళాశాలకు ఎగనామం!

నర్సీపట్నంలో ప్రభుత్వ మెడికల్ కళాశాల ఏర్పాటుకు గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం శ్రీకారం చుడితే..దానికి ఎగనామం పెట్టే ఆలోచనలో ప్రస్తుత కూటమి ప్రభుత్వం ఉంది. రానున్న 2025–26 విద్యా సంవత్సరంలో ప్రారంభించాలని నిర్ణయించిన ఏడు మెడికల్ కళాశాలల్లో ఒక పిడుగురాళ్ల వైద్య కళాశాలలో ప్రవేశాల అనుమతికి మాత్రమే దరఖాస్తు చేయాలని రాష్ట్ర ప్రభుత్వం భావిస్తోంది. మిగిలిన వైద్య కళాశాలలను పీపీపీ పద్ధతిలో నిర్మించాలనే యోచనలో ఉంది. ఇదే జరిగితే నర్సీపట్నం మెడికల్ కళాశాల ప్రైవేట్ వైద్య కళాశాలగా మారడం ఖాయమన్న వాదన వినిపిస్తోంది. దీంతో పేద విద్యార్థుల ఆశలపై నీళ్లు చల్లినట్టేనన్న విమర్శలు వినిపిస్తున్నాయి.

- నర్సీపట్నంతో పాటు 5 కళాశాలలపై ప్రైవేటు'
- పీపీపీ పద్ధతిలో నిర్మాణాలకు కూటమి ప్రభుత్వం యోచన
- ఇదే కళాశాల కోసం గత ప్రభుత్వం రూ.500 కోట్ల కేటాయింపు
- ప్రైవేటుపరం అయితే పేదలకు వైద్య విద్య కలే

సాక్షి, అనకాపల్లి : నర్సీపట్నంలో మెడికల్ కళాశాల ఏర్పాటుకు గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం శ్రీకారం చుడితే..ప్రస్తుత కూటమి ప్రభుత్వం దానిని ప్రైవేటు పరం చేయాలనే యోచనతో ఉంది. 2025–26 విద్యా సంవత్సరంలో ప్రారంభించాలని నిర్ణయించిన ఏడు మెడికల్ కళాశాలల్లో ఒక పిడుగురాళ్ల వైద్య కళాశాలలో మాత్రమే ప్రవేశాల అనుమతికి మాత్రమే దరఖాస్తు చేయాలని రాష్ట్ర ప్రభుత్వం భావిస్తోంది. దీనివల్ల మిగిలిన 6 (పార్వతీపురం, అమలాపురం, బాపట్ల, నర్సీపట్నం, పెనుకొండ, పాలకొల్లు) వైద్య కళాశాలల్లో ప్రభుత్వపరంగా ప్రవేశాలు జరిగే పరిస్థితులు కనిపించడం లేదు. ఇప్పటి వరకు జరిగిన నిర్మాణాలకు అనుగుణంగా పీపీపీ విధానంలో నిర్వహణకు ప్రముఖ సంస్థలు ముందు కొస్తే వాటికి **కళాశాలల నిర్వహణ బాధ్యతలు అప్పగించేలా** చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ప్రభుత్వం వైద్య ఆరోగ్య శాఖకు సూచించింది. ఇదే జరిగితే నర్సీపట్నం మెడికల్ కళాశాల ప్రైవేట్ వైద్య కళాశాలగా మారడం ఖాయం. ప్రైవేట్ వైద్య కళాశాలల్లో మాదిరిగానే ఫీజులతో సీట్ల భర్తీ, డబ్బులు చెల్లించి వైద్యం చేయించుకోవడమే జరుగుతుంది. రాష్ట్రంలో కొత్తగా రెండు ప్రభుత్వ వైద్య కళాశాలలు మాత్రమే రానున్నాయని తెలుస్తోంది.


వందేళ్లకు మరో కళాశాల

ఉత్తరాంధ్ర ప్రాంతంలో 1921లో ఆంధ్రా మెడికల్ కాలేజీ ఏర్పాటైంది. వందేళ్ల తర్వాత ఇదే ప్రాంతంలో అనకాపల్లి, పాడేరు ప్రభుత్వ మెడికల్ కాలేజీల ఏర్పాటుకు గత ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. పాడేరు కళాశాల పూర్తి చేసింది. అనకాపల్లి జిల్లాలో నర్సీపట్నంలో కూడా వైద్య కళాశాలకు సంబంధించి దాదాపు 50 శాతానికి పైగా నిర్మాణ పనులు పూర్తయ్యాయి. నర్సీపట్నం మెడికల్ కళాశాల పేదోడికి వరంలా మారిందనే లోపే ఆశలన్నీ కూటమి ప్రభుత్వం నిరాశ చేసింది. నర్సీపట్నం నియోజకవర్గంలో మాకవరపాలెం మండలం భీమబోయినపాలెంలో 52.15 ఎకరాల్లో ఏర్పాటు చేయనున్న మెడికల్ **కళాశాల నిర్మాణం పూర్తి చేసి గ్రామీణ ప్రాంతంలో** సూపర్ స్పెషాలిటీ వైద్యసేవలు అందుబాటులోకి తేవాలని గత ప్రభుత్వం సంకల్పించింది. జిల్లాకు ఒక మెడికల్ కాలేజీ ఉండాలన్న లక్ష్యంతో కళాశాలల ఏర్పాటుకు జగన్ ప్రభుత్వం నిధులు కేటాయించింది. ఈ సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి నిర్మాణంతో అనకాపల్లి జిల్లాతో పాటు అల్లూరి జిల్లాలోని కొయ్యూరు, చింతపల్లి, జీకే వీధి మండలాల గిరిజనులకు సైతం అధునాతన వైద్య వైద్య సేవలు అందుబాటులోకి వస్తాయి. ఇది అందుబాటులోకి వస్తే ఏటా 150 ఎంబీబీఎస్ సీట్లలో విద్యార్థులకు ప్రవేశం లభిస్తుంది. తర్వాత పీజీ వైద్య కోర్సులు వస్తాయి. తద్వారా పీజీ వైద్య విద్యార్థులు, వారికి వైద్య విద్య బోధించే ప్రొఫెసర్లు (నిపుణులైన వైద్యులు) అందుబాటులోకి వస్తారు. వారు ప్రభుత్వ ఉద్యోగులు కాబట్టి అక్కడే నివాసం ఉండాల్సి ఉంటుంది. దీంతో వారు గ్రామీణ ప్రజలకు 24 గంటలూ అత్యవసర వైద్యం అందించవచ్చు.

అడుగడుగునా అడ్డంకులు

అనకాపల్లి జిల్లాలో మెడికల్ కళాశాలను ఏర్పాటు చేయకుండా అప్పటి ప్రతిపక్ష టీడీపీ నాయకులు అడుగడుగునా అడ్డుకునే ప్రయత్నాలు చేశారు. తొలి **విడతలో అనకాపల్లి టౌన్‌లో కళాశాల ఏర్పాటుకు 50** ఎకరాల స్థలం కేటాయిస్తే..దీనిని అడ్డుకుంటూ న్యాయస్థానాలను ఆశ్రయించారు. దీంతో నర్సీపట్నం నియోజకవర్గం మాకవరపుపాలెంలో గల భీమబోయినపాలెంలో రూ.500 కోట్ల తో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం కళాశాల ఏర్పాటు చేసింది. ఇది 50 ఎకరాల్లో 13.21 లక్షల చ.అ. విస్తీర్ణంలో ఏర్పాటైంది. దాదాపు 50 శాతం పనులు పూర్తి చేసింది. బోధనా సుపత్రి, సూపర్‌స్పెషాలిటీ ఆసుపత్రిలో అత్యాధునిక సౌకర్యాలు, నర్సింగ్ కాలేజ్, వసతి సదుపాయం కల్పించేలా చర్యలు తీసుకుంది. ఏటా 150 ఎంబీబీఎస్ సీట్లలో అడ్మిషన్లకు తగ్గట్లుగా సౌకర్యాల ఏర్పాటుకు చర్యలు తీసుకున్నారు. ఇప్పటి వరకూ అత్యాధునిక హంగులతో మెడికల్ కాలేజీ, సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి, ఇతర భవనాల నిర్మాణాలు జరిగాయి. ఐటీడీ బ్లాక్ , 24 బై 7 బ్లాకు స్లాబ్ వేయడం జరిగింది. మార్చురీ బ్లాక్, మెడికల్ గ్యాస్ ప్లాంట్, బయోమెడికల్ గ్యాస్ ప్లాంట్, ఆసుపత్రి కిచెన్‌లు కూడా ప్రారంభయ్యాయి. పనులు ఫుట్టింగ్స్ లెవెల్స్ వరకు అయ్యాయి. 2025 నాటికి పూర్తి చేయాలనే సంకల్పంతో గత ప్రభుత్వం పనులు చేపట్టింది. కానీ ప్రభుత్వం మారగానే కూటమి ప్రభుత్వం పేదల **కళాశాలను ప్రైవేట్ పరం చే**సే యత్నం చేస్తోంది.

వరద నీటిలో కొట్టుకొచ్చిన అరుదైన అలుగు



గోనె సంచిలో ఉంచిన అరుదైన అలుగు

యలమంచిలి రూరల్ : యలమంచిలి ఎన్‌టీఆర్ కాలనీ సమీపంలో ఆదివారం రాత్రి అరుదైన భారతీయ అలుగు (ఇండియన్ పాంగోలిన్)ను స్థానిక అటవీశాఖ అధికారులు గుర్తించారు. దేశంలో అంతరించిపోయే దశలో ఉన్న అరుదైన అలుగు ఈ ప్రాంతంలో కనిపించడంతో అటవీఅధికారులు సైతం ఆశ్చర్యం వ్యక్తం చేశారు. భారీ వర్షాలకు ఎగువన పెదపల్లి రిజర్వ్ ఫారెస్ట్ ప్రాంతం నుంచి వరదనీటిలో అలుగు ఇక్కడకు కొట్టుకొచ్చినట్టు స్థానికులు అటవీ అధికారులకు సమాచారం అందజేశారు. ఎన్‌టీఆర్ కాలనీలో నివాసముంటున్న ఓ కుటుంబానికి చెందిన వారు అలుగును సంరక్షించారు. అక్కడకు చేరుకున్న యలమంచిలి అటవీ అధికారులు అలుగును స్వాధీనపర్చుకుని సమీపంలో అటవీ ప్రాంతంలో విడిచిపెట్టినట్టు రేంజ్ అధికారి అనిల్‌కుమార్ ఆదివారం రాత్రి సాక్షికి తెలిపారు. ప్రపంచంలో అత్యంత అరుదైన వన్యప్రాణుల్లో ఒకటిగా అలుగును గుర్తించారు. పదునైన చిప్పల్లాంటి పొలుసులతో ఉన్న ఈ అలుగులు నేల బొరియల్లో జీవిస్తాయి. చీమలు, చెద పురుగులను తింటాయి. వీటి మాంసాన్ని ఎక్కువగా చైనీయులు ఇష్టపడతారు. కొన్ని ఔషధాల్లో కూడా వాడతారు. ఒక అలుగు ధర దాదాపు కోటి రూపాయల వరకు పలుకుతుందని, అందుకే వీటి అక్రమ రవాణా జరుగుతుందని జంతు సంరక్షకులు చెబుతున్నారు.

వదలని వాన



అనకాపల్లి మండలం దిబ్బపాలెంలో ముంపునకు గురైన వరి పొలాలు

- జిల్లాలో శనివారం రాత్రి నుంచి ఏకధాటిగా కురుస్తున్న వర్షం
- సగటు వర్షపాతం 74 మి.మీ
- పొంగి పొర్లుతున్న రిజర్వాయర్లు, వాగులు, గెడ్డలు
- లోతట్టు ప్రాంతాలు జలమయం, ఒరిగిన చెట్లు
- అత్యధికంగా దేవరాపల్లి, కశింకోట, పాయకరావుపేటలో వర్షపాతం నమోదు

సాక్షి, అనకాపల్లి : బంగాళాఖాతంలో ఏర్పడిన తీవ్ర అల్పపీడనం వాయుగుండంగా బలపడడంతో జిల్లా వ్యాప్తంగా శనివారం అర్ధరాత్రి నుంచి భారీగా వర్షాలు కురిశాయి. అనకాపల్లి జిల్లాకు ఆరెంజ్ అలెర్ట్‌కు కూడా వాతావరణ శాఖ ప్రకటించింది. జిల్లా వ్యాప్తంగా శనివారం నుంచి ఆదివారం సాయంత్రం వరకూ 1775.5 మి.మీ వర్షం పాతం నమోదైంది. సగటు 74 వర్షపాతం నమోదైంది. రిజర్వాయర్లు, వాగులు, చెరువులు, గెడ్డలు పొంగిపొర్లుతున్నాయి. లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. జిల్లాలో తాండవ రిజర్వాయర్, రైవాడ, కోనాం, కల్యాణపులోవ రిజర్వాయర్లలో నీటి మట్టం ప్రమాదస్థాయికి చేరుకోవడంతో గేట్లు ఎత్తివేశారు. తాండవ గరిష్ఠ నీటి మట్టం 380 అడుగులు కాగా..ఈ వర్షాల కారణంగా 378 అడుగులకు చేరుకుంది. మరింత ఇన్ ఫ్లో రావడంతో ఆదివారం మధ్యాహ్నం 2గంటల సమయంలోనే అధికారులు స్పిల్‌వే గేట్ల ద్వారా 1200 క్యూసెక్కుల చొప్పున నీటిని విడుదల చేశారు. మాడుగుల మండలంలో పెద్దేరు జలాశయం గరిష్ఠ నీటిమట్టం 137 మీటర్లు కాగా..ఆదివారం నాటికి 136 మీటర్లకు చేరుకుంది. ఇన్‌ఫ్లో పెరగడంతో గేట్లు ఎత్తివేసి..200 క్యూసెక్కుల నీరు వదిలారు. కోనాం రిజర్వాయర్ గరిష్ఠ నీటి మట్టం 101.25 మీటర్ల కాగా..98.60 మీటర్లకు చేరుకుంది. రెండు గేట్లు ఎత్తి 1000 క్యూసెక్కుల నీరు వదిలారు. దేవరాపల్లి మండలంలో రైవాడ రిజర్వాయర్‌లో గరిష్ఠ నీటిమట్టం 114 మీటర్లు కాగా..ప్రస్తుతం 111 మీటర్లకు చేరింది. చోడవరం నియోజకవర్గంలో ఉన్న కల్యాణపు రిజర్వాయర్‌లో గరిష్ఠ నీటి మట్టం 460 అడుగులు కాగా..459.10 అడుగులకు చేరుకుంది. రిజర్వాయర్‌లో రెండు గేట్ల ద్వారా 200 క్యూసెక్కులు నీరు నదిలోకి విడుదల చేశారు.

పంట నష్టం లేకుండా జాగ్రత్తలు.

అనకాపల్లి జిల్లాలో తాండవ, కల్యాణపు లోవ, పెద్దేరు, కోనాం, రైవాడ రిజర్వాయర్ల ద్వారా దాదాపుగా 80 వేల ఎకరాలకు పైగా సాగు జరుగుతోంది.



బుచ్చెయ్యపేట మండలం తాచేరు వంతెన వద్ద వరదనీరు పోయేలా పొక్లెయిన్‌తో పనులు

వీటిపై ఆధారపడే 1.80 లక్షల రైతులు సాగు చేస్తున్నారు. జిల్లాలో తాండవ, కల్యాణపు లోవ, పెద్దేరు, కోనాం, రైవాడ రిజర్వాయర్ల ద్వారా 74,500 ఎకరాల సాగు నీరు అందుతోంది. వీటిపై 1.80 లక్షల మంది ఆధారపడి ఉన్నారు. రిజర్వాయర్ గేట్లు ఎత్తివేయడంతో సమీప గ్రామాలను అప్రమత్తం చేస్తున్నారు.

ఇసుక బస్తాలతో శారదా నది గట్టు పటిష్టం

మునగపాక : మండలంలోని గణపర్తి శారదానది **గట్టును తాత్కాలికంగా రూ.**2 లక్షల నిధులు వెచ్చించి ఇసుక బస్తాలతో పటిష్టతకు చర్యలు తీసుకున్నారు. మునగపాక మండల వ్యాప్తంగా 42.2 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైందని తహసీల్దార్ వినయ్‌కుమార్ తెలిపారు. 50 ఎకరాల మేర పంట పొలాలు ముంపునకు గురైనట్లు వ్యవసాయాధికారులు గుర్తించారు.



బుచ్చెయ్యపేట మండలం వడ్డాది పెద్దేరు నదిలో నీటి ప్రవాహం



శంకరం వద్ద ఉధృతంగా పారుతున్న ఏలేరు కాలువ

కంట్రోల్ రూం ఏర్పాటు..

భారీ వర్షాల దృష్ట్యా జిల్లా కలెక్టర్ కార్యాలయంతో పాటు ఆర్డీవో, అనకాపల్లి, నర్సీపట్నం ఆర్‌డీఓ కార్యాలయాల్లో కమాండ్ కంట్రోల్ రూమ్స్ ఏర్పాటు చేశారు.

కమాండ్ కంట్రోల్ రూమ్ ఫోన్ నంబర్లు

కలెక్టర్ కార్యాలయం :

08924-226599, 08924-222888

అనకాపల్లి రెవెన్యూ డివిజనల్ అధికారి కార్యాలయం : 9491998293

నర్సీపట్నం రెవెన్యూ డివిజనల్ అధికారి కార్యాలయం : 7075356563

వర్షాల పట్ల అప్రమత్తంగా ఉండండి

- జెడ్పీ చైర్‌పర్సన్ జల్లిపల్లి సుభద్ర

మహారాణిపేట: బంగాళాఖాతంలో వాయుగుండం నేపథ్యంలో ఉమ్మడి విశాఖ జిల్లాలో భారీ వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలని జెడ్పీ చైర్‌పర్సన్ జల్లిపల్లి సుభద్ర సూచించారు. అత్యవసరమైతే తప్ప ఇళ్ల నుంచి బయటకు రావద్దని సూచించారు. భారీ వర్షాల వల్ల వాగులు, వంకలు పొంగి పొర్లుతున్నాయని ముఖ్యంగా గిరిజన ప్రాంతంలో గెడ్డలు భారీ ఎత్తున ప్రవహిస్తున్నాయని ప్రజలు ఎవరూ గెడ్డలు దాటవద్దని చెప్పారు. పశువులు, మేకలు వారి వారి పాకల్లోనే ఉంచుకునేలా రైతులు జాగ్రత్తలు పడాలని పేర్కొన్నారు. సాధ్యమైనంత వరకు చెట్ల కింద ఉండొద్దని ప్రజలకు సూచించారు. పిడుగులు పడే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయని వాతావరణ శాఖ హెచ్చరించిన నేపథ్యంలో ఈ జాగ్రత్తలు తప్పనిసరిగా పాటించాలని తెలిపారు. గజనాథుని ఉత్సవాలు జరుగుతున్నాయని నిమజ్జన సమయంలో జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు.

జిల్లాలో శనివారం ఉదయం 8 గంటల నుంచి ఆదివారం రాత్రి 9 గంటల వరకూ సగటు వర్ష పాతం 74 మిల్లీమీటర్లగా నమోదైంది.

మండలం	శనివారం	ఆదివారం	మొత్తం	మండలం	శనివారం	ఆదివారం	మొత్తం	మండలం	శనివారం	ఆదివారం	మొత్తం	మండలం	శనివారం	ఆదివారం	మొత్తం
				పరవాడ	41.1	42.2	82.6	నక్కపల్లి	44.9	26.6	52.4	రాంబిల్లి	31.2	26.4	51
				ఎస్.రాయవరం	55.6	30	62.4	అచ్యుతాపురం	42.25	26.8	63.8	నాతవరం	14.4	42.6	57
దేవరాపల్లి	76.2మి.మీ	52	128.3	కోటపాడు	22.1	57	48.3	గొలుగొండ	39.3	29	85.3	మాకవరపాలెం	23	30.8	51.6
కశింకోట	59.4	40.6	100.0	మునగపాక	42.1	37	75.1	చీడికాడ	38.4	30.2	57.1	నర్సీపట్నం	20.3	25.6	58.1
యలమంచిలి	58.7	34.0	92.7	సబ్బవరం	40.6	37	77.2	రోలుగుండ	23.6	42.2	65.5	బుచ్చియ్యపేట	22.8	18.4	41.2
రావికమతం	38.6	48.6	68	అనకాపల్లి	39.3	36	80.3	కోటవురట్ల	38.2	26.4	46.6	సగటు వర్షపాతం	38.9	35.1	74.0
పాయకరావుపేట	54	29.6	68.8	చోడవరం	28.2	45.8	70.8	మాడుగుల	37.7	26.4	58.7				

గరిష్ట స్థాయికి జలాశయాలు

111 మీటర్లకు రైవాడ నీటి మట్టం


రైవాడ జలాశయం స్పిల్వే గేట్లు వద్దకు చేరిన వరదనీరు


వర్షపు నీటితో కళకళలాడుతున్న కోనాం జలాశయం

చీడికాడ: బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం కారణంగా ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు అనకాపల్లి జిల్లాలోని పలు జలాశయాల నీటి మట్టాలు గరిష్ట స్థాయికి చేరుకున్నాయి. కోనాం జలాశయం వరద నీటితో కళకళలాడుతోంది. ఆదివారం నాటికి జలాశయం నీటి మట్టం 98.60 మీటర్లకు చేరింది. జలాశయం పూర్తి స్థాయి నీటి మట్టం 101.25 మీటర్లు కాగా.. తాజాగా కురుస్తున్న వర్షాలకు జలాశయంలోకి 300 క్యూసెక్కుల నీరు వచ్చి చేరుతుందని జలాశయం జేఈ సిహెచ్.జయరామ్ తెలిపారు. జలాశయం నుంచి 1000 క్యూసెక్కుల నీరు దిగువకు విడుదల చేస్తున్నామన్నారు. కోనాం జలాశయ పరివాహక గ్రామాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఆయన సూచించారు.

దేవరాపల్లి : రైవాడ జలాశయం నీటిమట్టం ఆదివారం ప్రమాదకర స్థాయికి చేరుకుంది. ఎడతెరిపిలేకుండా కురుస్తున్న వర్షాలకు ఒక్కరోజు వ్యవధిలోనే ఒక మీటరు మేర జలాశయం నీటిమట్టం పెరిగింది. జలాశయం గరిష్ట నీటి మట్టం 114 మీటర్లు కాగా.. ప్రస్తుతం 111 మీటర్లకు చేరుకుంది. పైన విస్తారంగా కురుస్తున్న వర్షాలకు జలాశయంలోకి 2 వేల క్యూసెక్కుల వరద నీరు వచ్చి చేరుతోంది. ప్రమాదకర స్థాయి నీటి మట్టం 113.50 మీటర్లు కావడంతో జలాశయ పర్యవేక్షణ అధికారులు అప్రమత్తమయ్యారు. దేవరాపల్లిలో శనివారం రాత్రి 20 మిల్లీమీటర్ల, ఆదివారం 34 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. జలాశయంలోకి భారీగా వరదనీరు వచ్చి చేరుతుండడంతో స్పిల్‌వే గేట్లు ఎత్తి శారదానదిలోకి నీటిని విడుదల చేసే అవకాశం ఉందని ఇరిగేషన్ డీఈఈ జి.సత్యంనాయుడు, ఏఈ నరేష్ తెలిపారు. నదీ పరివాహక ప్రాంతాలు దేవరాపల్లి, కె.కోటపాడు, చోడవరం, అనకాపల్లి, కశింకోట, మునగపాక, యలమంచిలి, రాంబిల్లి మండలాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ప్రజలు శారదానదిలోకి దిగకుండా ఆయా గ్రామాల్లో దండోరా వేయాలని కోరారు.

మాడుగుల: పెద్దేరు జలాశయం కేచ్‌మెంట్ ఏరియాలో అధిక వర్షాలు కురవడంతో శుక్రవారం సాయంత్రానికి ప్రమాద స్థాయికి చేరుకుంది. ప్రస్తుతం 300 క్యూసెక్కుల వరద నీరు జలాశయంలోకి రావడంతో అధికారులు అప్రమత్తమయ్యారు. జలాశయం ప్రధాన గేటు ద్వారా అంతే వరద నీరు విడుదల చేస్తున్నారు. ఇన్‌ఫ్లో పెరిగితే రెండో గేటు ఎత్తుతామని జలాశయం అధికారులు తెలిపారు.

శారదా నదిపై నిలిచిన దోనె ప్రయాణాలు


కశింకోటలోని గవరపేటలో శారదానది ఒడ్డున నిలిపిన దోనెలు

కశింకోట: కశింకోటలోని గవరపేటలో శారదానదిపై దోనె ప్రయాణాలు నిలిచిపోయాయి. నది నీటి మట్టం క్రమేపి పెరగడం, ప్రవాహ ఉధృతి వల్ల మూడు రోజులుగా దోనెలను నడపకుండా ఒడ్డున నిలిపేశారు. దీంతో నది అవతల ఉన్న పంట పొలాలు, పశువుల శాలలకు దగ్గరి మార్గంగా దోనెలపై రాకపోకలు సాగించే రైతులు ఇబ్బంది పడుతున్నారు. గ్రామ శివారులో ఉన్న వంతెన మీదుగా సుమారు మూడు కిలోమీటర్ల దూరం నడిచి చేరుకోవలసి వస్తోందని వాపోతున్నారు. సమస్యను పరిష్కరించడానికి అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

క్లుప్తంగా

వెంకన్న ఆలయానికి రూ.10 లక్షల విరాళం


రూ.10 లక్షల విరాళం అందజేస్తున్న పార్టీ జిల్లా అధ్యక్షుడు ప్రసాద్, వ్యాపారవేత్త కృష్ణ

మునగపాక: మునగపాకలో నూతనంగా నిర్మిస్తున్న శ్రీ వేంకటేశ్వర స్వామి ఆలయానికి పలువురు భక్తులు విరాళాలు అందజేస్తున్నారు. ఆదివారం వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు బొడ్డేడ ప్రసాద్, వ్యాపారవేత్త ఆడారి కృష్ణ ఆయన సోదరుడు కొండలరావు సంయుక్తంగా రూ.10లక్షల చెక్కును నిర్వాహకులకు అందజేశారు. ఈ సందర్భంగా కమిటీ సభ్యులు మాట్లాడుతూ కలియుగ దైవం శ్రీనివాసుని ఆలయ నిర్మాణంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలన్నారు. విరాళాలు అందజేసి ఆలయ అభివృద్ధిలో పాలుపంచుకోవాలన్నారు. కార్యక్రమంలో పెంటకోట ఉమేష్, సూరిశెట్టి రాము, ఆడారి అచ్చియ్యనాయుడు, డాక్టర్ బద్దెం సూర్యనారాయణ, దాడి ముసిలి నాయుడు, పెంటకోట స్వామి సత్యనారాయణ, ఆడారి కాశీబాబు పాల్గొన్నారు.

తోట నగేష్‌కు పురస్కారం


అవార్డు అందుకుంటున్న తోట నగేష్

పాయకరావుపేట: ఢిల్లీ ప్రధాన కేంద్రంగా పని చేస్తున్న ఆదిలీల ఫౌండేషన్ ఆధ్వర్యంలో జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ తోట నగేష్‌కు భారతీయ సేవా సామ్రాట్ అవార్డ్ దక్కింది. ఢిల్లీలో ఈ నెల 5వ తేదీన డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణ మెమోరియల్ అవార్డు పేరిట పురస్కార ప్రధాన కార్యక్రమంలో సేవా రంగంలో ఆయన అవార్డు అందుకున్నారు. పాయకరావుపేట ప్రాంతంలో తాండవ నదిపై రెండు మినీ ఆనకట్టల నిర్మాణానికి చేసిన కృషికి, తాగునీటి అభివృద్ధికి, విద్యాభివృద్ధికి చేసిన కృషిని పరిగణలోనికి తీసుకుని ఈ పురస్కారం అందించినట్లు అవార్డు గ్రహీత నగేష్‌ఒక ప్రకటనలో తెలిపారు.

హార్డ్‌వేర్ షాపులో అగ్నిప్రమాదం

రూ. 30లక్షలు ఆస్తినష్టం


షాపులో వ్యాపించిన మంటలు


మంటలను ఆర్పుతున్న అగ్నిమాపక సిబ్బంది

చోడవరం: విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా హార్డ్‌వేర్ షాపు అగ్నిప్రమాదానికి గురైంది. ఈ ప్రమాదంలో సుమారు రూ.30 లక్షలు విలువైన ఆస్తినష్టం వాటిల్లింది. రావికమతం జంక్షన్‌లో దాచేపల్లి రామారావు (నానాజీ)కిచెందిన హార్డ్‌వేర్, పెయింట్స్ అమ్మకాలు చేసే రెండు అంతస్తుల దుకాణం ఆదివారం అగ్ని ప్రమాదానికి గురైంది. షాపులో విద్యుత్ షార్ట్ సర్క్యూట్ జరగడంతో ఒక్కసారిగా మంటలు వ్యాపించాయి. ఆ సమయంలో షాపు యజమాని నానాజీ షాపు మొదటి అంతస్తులో న్నారు. షాపులో మంటలు వేగంగా కమ్ముకోవడంతో ఆయన కేకలు వేశారు. పక్క షాపు వాళ్లు వెంటనే స్పందించి కిటికీ సాయంతో నిచ్చెన వేసి నానాజీని బయటకు తీసుకొచ్చారు. షాపులో ఉన్న పెయింట్స్, విద్యుత్ పరికరాలు, హార్డ్‌వేర్ సామాగ్రి ఈ ప్రమాదంలో కాలిపోయి పెద్ద మంటలు వ్యాపించాయి. సమీపంలో ఉన్న వారు వెంటనే అగ్నిమాపక కేంద్రానికి సమాచారం ఇచ్చారు. అయితే ప్రమాద తీవ్రత ఎక్కువగా ఉండి మంటలు చల్లారకపోవడంతో జిల్లా నలుమూలల నుంచి మూడు అగ్నిమాపక శకటాలు వచ్చి మంటలను అదుపు చేశాయి. సుమారు రూ. 30లక్షలు ఆస్తి నష్టం ఉంటుందని అగ్నిమాపక అధికారులు చెప్పారు. కేసును నమోదు చేశారు.

రోడ్డు కోసం బురదలో కూర్చొని నిరసన

దేవరాపల్లి: తమ గ్రామానికి రోడ్డు సౌకర్యం కల్పించాలని కోరుతూ చింతలపూడి పంచాయతీ శివారు వీరభద్రపేట గిరిజనులు వినూత్న రీతిలో నిరసన తెలిపారు. కాలినడకన సైతం వెళ్లేందుకు అవకాశం లేని బురదమయమైన రహదారిలో కూర్చొని తమ ఆవేదన వ్యక్తం చేశారు. వారికి సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు డి.వెంకన్న మద్దతు తెలిపారు. తమ గ్రామానికి రహదారి సౌకర్యం లేకపోవడంతో అత్యవసర సమయాల్లో నానా అవస్థలు పడుతున్నామని వాపోయారు. అనారోగ్యానికి గురైన చిన్నారులు, వృద్ధులు, గర్భిణులను డోలీ మోతతో ఆస్పత్రికి తీసుకెళ్లాల్సి వస్తోందని చెప్పారు. చింతలపూడి నుంచి వీరభద్రపేట గ్రామానికి రోడ్డు సౌకర్యం కల్పిస్తే అనంతగిరి మండలానికి చెందిన సోలుబొంగు, చినబురగ గ్రామాల గిరిజనులకు కూడా రహదారి కష్టాలు తీరుతాయన్నారు. ఎన్నికల సమయంలో రోడ్డు ఏర్పాటు చేస్తామని చెప్పిన కూటమి నాయకుల మాటలు కార్యరూపం దాల్చలేదని సీపీఎం నాయకుడు డి.వెంకన్న ఆరోపించారు. జిల్లా కలెక్టర్ స్పందించి మండలంలోని గిరిజన గ్రామాలకు రహదారి సౌకర్యం కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో జె.ఈశ్వరరావు, బడ్నాల జోగులు, తామర్ల బుచ్చిబాబు, గిరిజన మహిళలు పాల్గొన్నారు.

విజయవాడ వరద బాధితులకు నిత్యావసరాల సరఫరా


జిల్లా డిస్ట్రిబ్యూటర్స్, వాసవీ క్లబ్ సభ్యుల ఆధ్వర్యంలో వరద బాధితులకు తరలిస్తున్న సరకులు

అనకాపల్లి : విజయవాడ వరద బాధితులకు ప్రతి వ్యక్తి సహాయం అందించాలని జిల్లా డిస్ట్రిబ్యూటర్ అసోసియేషన్ అధ్యక్షుడు పి.ఎస్.ఎస్.ఎన్. జోసఫ్ అన్నారు. డిస్ట్రిబ్యూటర్స్, వాసవీ క్లబ్ సభ్యుల ఆధ్వర్యంలో ఆదివారం విజయవాడలో వరద బాధితులకు నిత్యవసర వస్తువులను వ్యాన్ ద్వారా సరఫరా చేశారు. సుమారుగా రూ.5 లక్షల విలువ గల నిత్యవసర సరుకులు విజయకవాడకు పంపించడం జరిగిందన్నారు.

కోతుల దాడిలో 10 మందికి గాయాలు

బుచ్చెయ్యపేట: మండలంలోని వడ్డాది మేజరు పంచాయతీలో కోతులు దాడి చేసి పది మందిని గాయపరిచాయి. శని, ఆదివారాల్లో దొండా వారి పాత మేడ దగ్గర గ్రామానికి చెందిన మజ్జి రేవతి, సయ్యపురెడ్డి జయమ్మ, సుంకరి దినేష్, చిట్టెమ్మ, మాలిన వరలక్ష్మి, అమరపిన్ని ప్రియాంక, చింతల సూర్యకాంతం తదితరులను గాయపరిచాయి. లోపూడిలో బండి కావేరమ్మను కోతి కరవడంతో వీరంతా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. వడ్డాది, లోపూడి, బంగారుమెట్ట, ఎల్.బి.పురం, శింగవరం తదితర గ్రామాల్లో కోతులు దాడి చేస్తున్నాయి. రోజూ ఇళ్లలో నుంచి బయటకు రావడానికి చిన్నారులు, వృద్ధులు, మహిళలు భయభ్రాంతులకు గురవుతున్నారు. జిల్లా అధికారులు స్పందించి కోతుల బెడద నుంచి కాపాడాలని కోరుతున్నారు.

పారిశుధ్య కార్మికుల మానవత్వం

- తోటి కార్మికుడి అంత్యక్రియలు నిర్వహణ

మల్కాపురం: ఓ పారిశుధ్య కార్మికుడు అనారోగ్యంతో మృతి చెందాడు. అతనికి నా అన్న వారు ఎవరూ లేకపోవడంతో.. తోటి పారిశుధ్య కార్మికులే దహన సంస్కారాలు నిర్వహించారు. వివరాలివీ.. జీవీఎంసీ 59వ వార్డు శాంతిగిరి కాలనీకి చెందిన ఓ.అప్పలనాయుడు(56) పారిశుధ్య కార్మికుడిగా పనిచేస్తున్నాడు. మద్యం సేవించే అలవాటున్న అతను బ్లడ్ క్యాన్సర్‌తో కొంత కాలంగా బాధపడుతున్నాడు. విధులు అనంతరం 60వ వార్డు పరిధి గుల్లలపాలెం వద్ద గల మహాత్మాగాంధీ షాపింగ్ కాంప్లెక్స్ వెనుక ఉన్న హాకర్స్ జోన్ వద్ద నిద్రిస్తుంటాడు. శనివారం సాయంత్రం అక్కడే నిద్రించిన అప్పలనాయుడు ఆదివారం కదలిక లేకపోవడంతో తోటి కార్మికులు గమనించారు. తొలుత మద్యం సేవించి మత్తులో ఉంటాడని భావించారు. ఆ తర్వాత ఆయన నుంచి ఎటువంటి కదలికలు లేకపోవడంతో మృతి చెందినట్లు నిర్ధారించుకున్నారు. ఈ విషయాన్ని మల్కాపురం పోలీసుల దృష్టికి తీసుకెళ్లారు. సీఐ విద్యాసాగర్ ఘటనా స్థలానికి వచ్చి మృతుడి వివరాలను సేకరించారు. సహజ మరణంగా నిర్ధారించారు. అయితే ఆయన దహన కార్యక్రమాలు చేసేందుకు ఎవరూ ముందుకు రాకపోవడంతో.. తోటి పారిశుధ్య కార్మికులే మానవత దృక్పథంలో స్పందించారు. స్థానిక శ్మశానవాటికలో అప్పలనాయుడు దహన సంస్కారాలు పూర్తి చేశారు.

37 మద్యం సీసాలు స్వాధీనం


స్వాధీనం చేసుకున్న మద్యం సీసాలతో ఎస్ఐ ప్రసాదరావు

మునగపాక : ఎటువంటి అనుమతులు లేకుండా మద్యం విక్రయిస్తున్న ఇద్దరు వ్యక్తులను అరెస్టు చేసి 37 మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ పి.ప్రసాదరావు తెలిపారు. వివరాలివి. మండల పరిధిలో ఎటువంటి అనుమతులు లేకుండా మద్యం విక్రయిస్తున్నట్టు అందిన ఫిర్యాదు మేరకు ఎస్ఐ ప్రసాదరావు తన సిబ్బందితో శనివారం దాడి జరిపారు. ఇద్దరు వ్యక్తులు అనధికారికంగా మద్యం విక్రయిస్తున్నట్టు గుర్తించి వారి నుంచి 37 మద్యం సీసాలు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశారు.

పంచాయతీ కార్యదర్శుల బదిలీలు నిలిపివేయాలి


అనకాపల్లి ఎంపీడీవో కార్యాలయంలో సమావేశమైన విశాఖ ఉమ్మడి జిల్లాల పంచాయతీ కార్యదర్శులు

- జనాభా, ఆదాయం ప్రాతిపదికన గ్రేడ్లు కేటాయించాలి
- ఉమ్మడి విశాఖ జిల్లా కార్యదర్శుల డిమాండ్

అనకాపల్లి: విశాఖ ఉమ్మడి జిల్లాలో పంచాయతీ కార్యదర్శుల బదిలీలు తక్షణం నిలిపివేయాలని పంచాయతీ కార్యదర్శులు పబ్లిక్ సర్వీస్ కమిషన్ ఉమ్మడి విశాఖ జిల్లా 2014, 2018, 2020 సంఘం నాయకులు కె.నాగేశ్వరరావు, వై.యోగి, ఎస్.రాజేష్ డిమాండ్ చేశారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఆదివారం విశాఖ ఉమ్మడి జిల్లాల పంచాయతీ కార్యదర్శుల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పంచాయతీలకు జనాభా, ఆదాయం ప్రాతిపదికన గ్రేడ్ల విభజన చేయాల్సి ఉందన్నారు. ఎటువంటి ప్రామాణికత తీసుకోకుండా గ్రేడ్ల కేటాయింపు చేయడం అన్యాయమని చెప్పారు. ఇలా చేయడం వల్ల కొత్తగా నియామకాలు పొందిన గ్రేడ్-5 పంచాయతీ కార్యదర్శులు జనాభా, ఆదాయం ఎక్కువగా ఉన్న పంచాయతీల్లో, గ్రేడ్-1, 2 పంచాయతీ కార్యదర్శులు తక్కువగా ఆదాయం, జనాభా గల చిన్న గ్రామ పంచాయతీల్లో విధులు నిర్వహించాల్సిన పరిస్థితి ఉందన్నారు. ఏజెన్సీ ప్రాంతానికి చెందిన పంచాయతీ కార్యదర్శులు తమ కుటుంబాలకు దూరంగా మైదాన ప్రాంతాల్లో ఉండేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవడం అన్యాయమని వారు పేర్కొన్నారు. జనాభా, ఆదాయం ప్రాతిపదికన సక్రమంగా గ్రేడ్ల కేటాయింపు జరిపిన తరువాత ఉమ్మడి విశాఖ జిల్లాలో పంచాయతీ కార్యదర్శుల బదిలీలు చేయాలని వారు కోరారు. ఉమ్మడి విశాఖ జిల్లాలో 970 మంది పంచాయతీ కార్యదర్శులకు అనకాపల్లి జిల్లాలో 651 మంది, అల్లూరి సీతారామరాజు జిల్లాలో 243 మంది, విశాఖ జిల్లాలో 76 మంది ఉన్నారన్నారు. 74 మంది గ్రేడ్-1, 49 మంది గ్రేడ్-2, 149 మంది గ్రేడ్-3, 280 మంది గ్రేడ్-4, 47 మంది అడిషినల్ గ్రేడ్-4, 371 మంది గ్రేడ్-5 విధులు నిర్వహిస్తున్నట్టు వారు వివరించారు.

రెండు ఇసుక ట్రాక్టర్ల పట్టివేత

- నామమాత్రపు పెనాల్టీతో యధావిధిగా అక్రమాలు
- చట్టంలో లొసుగులతో రాజకీయంగా లబ్ధి


పోలీసులు పట్టుకున్న ఇసుక ట్రాక్టర్లు

నక్కపల్లి: తీర ప్రాంతాల్లో ఇసుక మాఫియా ఆగడాలు రోజు రోజుకు మితిమీరుతున్నాయి. ఇక్కడ గ్రామాల్లో జిరాయితీ భూముల్లోను తీరంలోను ఇసుక అక్రమంగా తవ్వి తరలిస్తున్నారు. నెల రోజుల వ్యవధిలో పోలీసులు నాలుగేసి చొప్పున ఇసుక లారీలను, ట్రాక్టర్లను పట్టుకున్నారు. శనివారం గునుపూడి వద్ద రెండు ఇసుక ట్రాక్టర్లు పట్టుకుని పెనాల్టీ విధించారు. అయినా మాఫియా భయపడటం లేదు. పట్టుకున్న ఇసుక వాహనాలను పెనాల్టీ కోసం తహసీల్దారుకు సిఫార్సు చేస్తున్నారు. ఇసుక మాఫియా రెవెన్యూ వారిపై ఒత్తిడి చేస్తోంది. ఇది సముద్రపు ఇసుక కాదని, నామమాత్రపు పెనాల్టీ విధించేలా తమ రాజకీయ పలుకుబడి ఉపయోగిస్తోంది. దీంతో పట్టుకున్న గంటల వ్యవధిలో డబ్బులు చెల్లించి వాహనాలు విడిపించుకుని వెళ్లి యధావిధిగా ఇసుక రవాణా చేస్తున్నారు. సీఆర్‌జెడ్ నిబంధనల ప్రకారం కేసులు నమోదు చేసి పెనాల్టీ విధిస్తే వాహనం సీజ్ చేయాలి. పట్టుబడ్డ వాహనం అంత తొందరగా విడిపించుకునే పరిస్థితి ఉండదు. కాని స్థానిక అధికారులు కేసులు నమోదు చేసి పెనాల్టీ విధించే సందర్భంలో సముద్రపు ఇసుక అని ఎక్కడ నమోదు చేయకపోవడం గమనార్హం. దాంతో పెనాల్టీ కట్టి వాహనం వెంటనే తీసుకెళ్లిపోతున్నారు. ఈ కారణంగానే ఇసుక అక్రమ రవాణాకు తవ్వకాలకు అడ్డుకట్ట పడటం లేదని పలువురు బాహాటంగానే ఆరోపిస్తున్నారు. పట్టుబడ్డ ఇసుక సముద్రపు ఇసుక కాదా అనేది సమగ్రంగా విచారించి కేసులు నమోదు చేయాలని, అప్పుడే ఇసుక అక్రమ రవాణాకు అడ్డుకట్ట పడుతుందని చెబుతున్నారు. ఇసుక తవ్వకాల వల్ల తుపాన్లు వచ్చిన సమయంలో తీర గ్రామాలకు ముప్పు వాటిల్లే ప్రమాదం ఉందని మత్స్యకారులు ఆందోళన చెందుతున్నారు. ఇసుక రవాణా చేస్తూ పట్టుకున్న వాహనాలపై కఠినంగా వ్యవహరించాలని పలువురు కోరుతున్నారు. విధించే పెనాల్టీ కూడా చాలా తక్కువగా ఉండటం వల్ల వెంటనే చెల్లించేస్తున్నారని, ఆ మొత్తాన్ని మళ్లీ వినియోగదారులపై మోపుతున్నారు. ఉచితంగా లభించే ట్రాక్టర్ ఇసుక రూ. 8 వేలకు పైగా విక్రయిస్తున్నారు.

మత్స్యవానిపాలెం వద్ద రెండు బైక్‌లు ఢీ

ఒకరి మృతి, ముగ్గురికి తీవ్ర గాయాలు


మృతుడు రామరాజు(ఫైల్)

ప్రమాద స్థలంలో మోటారు సైకిళ్లను పరిశీలిస్తున్న ఎస్ఐ లక్ష్మణరావు

చోడవరం: రావికమతం మండలం మత్స్యవానిపాలెం సమీపంలో శనివారం రాత్రి 11 గంటల సమయంలో ఎదురెదురుగా వచ్చిన రెండు మోటారు సైకిళ్లు ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో టి.అర్జాపురం గ్రామానికి చెందిన అద్దిపల్లి రామరాజు (34) మృతి చెందాడు. అదే గ్రామానికి చెందిన చౌహాన్‌రాజు (23), మచ్చా రామునాయుడు (36), పేరపు శివ (22) తీవ్రంగా గాయపడ్డారు. వివరాల్లోకి వెళితే... టి.అర్జాపురం గ్రామానికి చెందిన అద్దిపల్లి రామరాజు, మచ్చా రామునాయుడు మోటారుసైకిల్‌పై కొత్తకోట నుంచి వస్తున్నారు. అదే సమయంలో అదే గ్రామానికి చెందిన కోసిరెడ్డి చౌహాన్‌రాజు తన మోటారు సైకిల్‌పై ఎదురుగా వస్తున్నాడు. ఈ రెండు వాహనాలు మెయిన్ రోడ్డుపై మత్స్యవానిపాలెం కాటా వద్ద బలంగా ఢీకొన్నాయి. దాంతో తీవ్ర గాయాలైన ముగ్గురిని ప్రాథమిక చికిత్స నిమిత్తం నర్సీపట్నం ఏరియా ఆస్పత్రికి తరలించారు. తలకు దెబ్బతగిలిన అద్దెపల్లి రామరాజు పరిస్థితి విషమంగా ఉండటంతో మెరుగైన వైద్యం కోసం అనకాపల్లి వంద పడకల ఆస్పత్రికి ఆదివారం ఉదయం తరలిస్తుండగా మార్గమధ్యంలో మృతిచెందాడు. మిగతా ఇద్దరూ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. రామరాజు పెయింటింగ్ పనిచేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. ఇంటి యజమాని రోడ్డు ప్రమాదంలో మృతి చెందడంతో భార్య లక్ష్మి, పిల్లలు బోరున విలపిస్తున్నారు. కొత్తకోట ఎస్ఐ లక్ష్మణరావు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

క్లుప్తంగా

ధ్యాన వెంకన్నకు ప్రత్యేక పూజలు


అలంకరణలో ధ్యాన వేంకటేశ్వర స్వామి

కశింకోట: వినాయక ఉత్సవాల్లో భాగంగా కశింకోట ధ్యాన వేంకటేశ్వర స్వామి ఆలయంలో శనివారం ప్రత్యేక పూజలు చేశారు. స్వామిని వజ్ర కవచంతోపాటు వివిధ రకాల పూలమాలలు, తులసీ మాలలతో అలంకరించారు. విష్ణు సహస్ర నామార్చన చేశారు. అధిక సంఖ్యలో భక్తులు దర్శించారు. ఆలయ అర్చకుడు రేజేటి శ్రీరామచరణాచార్యులు ఆధ్వర్యంలో పూజా కార్యక్రమాలు నిర్వహించారు.

ఆర్టీసీ కాంప్లెక్స్ వద్ద పేరుకుపోయిన చెత్త


చెత్తమయమైన ఆర్టీసీ కాంప్లెక్స్ ప్రాంతం

అనకాపల్లి : ఆర్టీసీ కాంప్లెక్స్ వద్ద వినాయక చవితి నిమిత్తం వివిధ ప్రాంతాల నుంచి ఫలాలు, పత్రి తీసుకొచ్చి విక్రయించిన వ్యాపారులు మిగిలింది అక్కడే వదివేసి వెళ్లిపోవడంతో వర్షానికి దుర్వాసన వెదజలుతోంది. జిల్లా కేంద్రంలోని ప్రధాన బస్టాప్ పరిసరాల్లో పారిశుధ్య కార్మికులు చెత్త తొలగించ లేదంటే వీధులు ఎలా ఉంటాయో అర్థం చేసుకోవచ్చని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ చెత్తను తొలగించాలని ప్రజలు కోరుతున్నారు.

స్టీల్‌ప్లాంట్ పరిరక్షణకు 10న రాస్తారోకో

అనకాపల్లి: విశాఖ స్టీల్‌ప్లాంట్ పరిరక్షణకు ఈనెల 10న కూర్మనపాలెంలో రాస్తారోకో నిర్వహిస్తామని సీఐటీయూ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఆర్.శంకరరావు, జి.కోటేశ్వరరావు ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. స్టీల్‌ప్లాంట్‌ను ప్రైవేట్ వ్యక్తులకు విక్రయించేందుకు మోదీ ప్రభుత్వం చర్యలు చేపడుతుందని, 1300 రోజులుగా కార్మిక సంఘాలు నిరసన తెలుపుతున్నా పట్టించుకోవడం లేదన్నారు. మోదీ విధానాలతో ఇప్పటికే రెండు బ్లాస్ట్ ఫర్నేసుల్లో ఉత్పత్తి నిలిపివేశాయని, పరిశ్రమను నష్టాల బాటలోకి నెట్టేందుకు కేంద్రం కుట్ర పన్నుతుందన్నారు. ప్లాంట్‌కు సొంత గనులు కేటాయిస్తే ప్రభుత్వానికి కోట్లాది రూపాయలు ఆదాయం చేకూరుతుందన్నారు.

14 నుంచి 'పరమేశ్వరీ వైభవం' ప్రవచనాలు

అనకాపల్లి: స్థానిక మెయిన్ రోడ్డులోని కన్యకా పరమేశ్వరి ప్రతిష్ఠ శతజయంతి మహోత్సవాల్లో భాగంగా ఈ నెల 14, 15, 16 తేదీల్లో శ్రీ పరమేశ్వరీ వైభవం ప్రవచనాల కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఆలయ అధ్యక్షుడు బిళ్లపాటి కృష్ణకుమార్ ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. సాయంత్రం 6 నుంచి 8 గంటల వరకు అమ్మవారి దేవస్థానం ఆవరణలో సమన్వయ సరస్వతి, వాగ్దేవి వరపుత్ర ప్రవచన విరించి సద్గురు సామవేదం షణ్ముఖశర్మచే ప్రవచనాలు జరుగుతాయని తెలిపారు.

అనకాపల్లి సినిమాలు

35.. చిన్న కథ కాదు : రాజా
ది గ్రేటెస్ట్ ఆఫ్ ఆల్ టైమ్ : సత్యనారాయణ 1
కమిటీ కుర్రోళ్లు : సత్యనారాయణ స్క్రీన్-2
సింబా : పర్తిసాయి
సరిపోదా శనివారం : షిర్డీ సాయి
డబుల్ ఇస్మార్ట్ : వెంకటేశ్వర
మారుతీనగర్ సుబ్రమణ్యం : శ్రీసత్య
డిమోంటి కాలనీ-2 : రామచంద్ర

రక్త నిల్వలు

అనకాపల్లి: జిల్లా ఎన్టీఆర్ వైద్యాలయ రక్తనిధి కేంద్రంలో 104 యూనిట్ల రక్తం నిల్వ ఉంది. ఏ పాజిటివ్-21 యూనిట్లు, బీ పాజిటివ్-36 యూనిట్లు, ఓ పాజిటివ్-38 యూనిట్లు, ఏబీ పాజిటివ్-9 యూనిట్లు శుద్ధి చేసిన రక్తం నిల్వ ఉంది. అవసరమైన వారు వైద్యాలయం బ్లడ్ బ్యాంకు టెక్నీషియన్ యు.లోకేష్ (9703619706) నంబరులో సంప్రదించవచ్చు.

గ్యాస్ సమాచారం

అనకాపల్లి : ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ ద్వారా ఆదివారం 168 మంది గ్యాస్ బుక్ చేసుకున్నారు. గతంలో బుక్ చేసుకున్న వారిలో 51 మందికి సిలిండర్లు సరఫరా చేశారు. వివరాలకు ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ (08924223595)ని సంప్రదించవచ్చు.

ఏకదంతం.. విభిన్న రూపం


కశింకోటలోని కనకమహాలక్ష్మి వీధిలో నందిపై కొలువైన వినాయకుడు

- ఘనంగా వినాయక నవరాత్రి ఉత్సవాలు
- వాడవాడలా వెలసిన పందిళ్లు
- గణనాథునికి ఘనంగా పూజలు

విఘ్న సంహారకా.. అని శరణు వేడగానే కళ్ల ముందు కదిలే దైవం గణేశుడు. సకల విఘ్నాలు తొలగించి, చల్లగ కాచే తండ్రి వినాయకుడు. ఆ ఆదిదేవుడికి వినాయక చవితి సందర్భంగా ఊరూ వాడా, వీధివీధినా చలువ పందిళ్లు, మండపాలు ఏర్పాటు చేసి భారీ విగ్రహాలను కొలువుదీర్చారు. వినాయక నవరాత్రి ఉత్సవాలకు కమిటీ సభ్యులు శ్రీకారం చుట్టారు. ఉదయం, సాయంత్రం పూజలు, భజనలు, తీర్థ ప్రసాద వితరణతో ప్రతి మండపం ఆధ్యాత్మికతను సంతరించుకుంది.


వేల్పులవీధి రాఘవేంద్రస్వామి గుడి వద్ద ఏర్పాటు చేసిన గణపతి


వినాయక నిమజ్జనంలో పాల్గొన్న మహిళా భక్తులు


గృహాల్లో పూజలందుకున్న మట్టి గణపతులను శారదా నదిలో నిమజ్జనం చేస్తున్న భక్తులు

అనకాపల్లి: పట్టణ, మండలంలోని పలు ప్రాంతాల్లో వినాయక చవితి వేడుకలు శనివారం ఘనంగా ప్రారంభమయ్యాయి. పలు ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన వినాయక పందిళ్లలో భక్తులు తమ శక్తి కొద్దీ వినాయక విగ్రహాలు ఏర్పాటు చేశారు. వివిధ రకాలైన పత్రులు, పిండి వంటలు, ఫ్రూట్స్, స్వీట్స్ తయారు చేసి స్వామివారికి నైవేద్యంగా సమర్పించారు. విగ్రహాలు కొనుగోలు చేసిన ప్రాంతం నుంచి మండపాల వరకూ గణపతిని మేళతాళాలతో ఊరేగించారు. పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ కృషి చేస్తూ, భావితరాలను దృష్టిలో పెట్టుకుని 90 శాతం మంది మట్టి గణపతులనే ఏర్పాటు చేసి పూజిస్తున్నారు.

- గృహాలు, వ్యాపార సముదాయాల్లో ఏర్పాటు చేసిన గణపతి విగ్రహాలకు ప్రత్యేక పూజలు చేసి అదే రోజు సాయంత్రం 4 గంటల నుంచి స్థానిక శారదా నదిలో గణపతులను నిమజ్జనం చేశారు.
- స్థానిక శారదా నదిలో వినాయక నవరాత్రులను పురస్కరించుకుని శారదా ఘాట్ వద్ద పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేసినట్లు పట్టణ సీఐ టి.వి.విజయకుమార్ తెలిపారు. నిమజ్జనోత్సవంలో భాగంగా వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తుల సౌకర్యార్థం జీవీఎంసీ, నీటిపారుదల శాఖ అధికారులు ఏర్పాట్లు చేశారు. శారదా ఘాట్ వద్ద బారికేడ్లు ఏర్పాటు చేసి భక్తుల రాకపోకలను నియంత్రించారు. గృహాల్లో పూజలందుకున్న సుమారు 24 వేల విగ్రహాలను నదిలో నిమజ్జనం చేశారు.
- శారదానది ఒడ్డున వినాయక నిమజ్జనోత్సవంలో భాగంగా గంధం గ్రూప్ ఆఫ్ కంపెనీ ప్రతినిధి గంధం సునీత ఆధ్వర్యంలో వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులకు ఉచితంగా పులిహోర పంపిణీ కార్యక్రమాన్ని ట్రాఫిక్ సీఐ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఆడారి కుమారస్వామి, కొణతాల హరనాథ్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

కశింకోటలో..

కశింకోట : మండల గ్రామాల్లో గణేష్ నవరాత్రి ఉత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. కశింకోటలోని గవరపేట, మేదరవీధి, సంతబయల, కస్పావీధి, రౌతు వీధి, ద్వారపురెడ్డి వీధి, కనక మహాలక్ష్మి వీధి, వేణుగోపాలస్వామి ఆలయం వీధి, పూసర్ల వీధి, సలాది వీధి, కోమటి వీధి, డీపీఎన్ హైస్కూలు వద్ద, పెద బజారు, అగ్రహారం, హౌసింగ్ కాలనీ, గోవిందరావు కాలనీ, అఫీషియల్ కాలనీ, సత్తెమ్మ కాలనీ, భవానీ కాలనీ తదితర ప్రాంతాల్లో చలువ పందిళ్లు, సెట్టింగ్‌లు వేసి పెద్ద వినాయక విగ్రహాలు, వినూత్న విగ్రహాలను ఊరేగింపు నిర్వహించి ఉత్సాహంగా నెలకొల్పారు. అలాగే తాళ్లపాలెం, బయ్యవరం, నరసింగబిల్లి, చింతలపాలెం, నూతలగుంటపాలెం, ఏఎస్ పేట, గొబ్బూరు, ఉగ్గినపాలెం, జమాదులపాలెం, తేగాడ, కొత్తపల్లి, బుచ్చియ్యపేట, పేరంటాలపాలెం, జోగారావుపేట, కన్నూరుపాలెం, జి.భీమవరం, అచ్చెర్ల, తీడ, చెరకాం, లాలంకొత్తూరు, మోసయ్యపేట, బంగారయ్యపేట తదితర గ్రామాల్లో వినాయక విగ్రహాలు, ప్రతిమలు నెలకొల్పి ఉత్సాహంగా ఉత్సవాలు నిర్వహిస్తున్నారు.

- గవరపాలెం నూకాంబిక అమ్మవారి ఆలయంలో శనివారం గణపతి మహోత్సవాన్ని ఆలయ ఉద్యోగులు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆలయ ఈవో బండారు ప్రసాద్ మాట్లాడుతూ నవరాత్రులు ఘనంగా నిర్వహిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.


పూడిమడక రహదారిలో ఏర్పాటు చేసిన గణేశుడు


పూసర్ల వీధిలో నెమలిపై కొలువుదీరిన గణపతి


వేణుగోపాలస్వామి ఆలయం వద్ద పూజలందుకున్న వినాయకుడు


సిరసపల్లి చింతామణి దత్తక్షేత్రంలో వినాయకుడిని దర్శించుకుంటున్న భక్తులు


నూకాంబిక అమ్మవారి ఆలయంలో గణపతి నవరాత్రులు నిర్వహిస్తున్న ఆలయ ఉద్యోగులు


వేల్పులవీధి కాశీవిశ్వేశ్వరస్వామి ఆలయం వద్ద అనంతపద్మనాభ స్వామి అవతారంలో వినాయకుడు

విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలు


విద్యార్థికి ప్రతిభా పురస్కారం అందజేస్తున్న ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ


దామోదర్‌కు ప్రతిభా పురస్కారం అందజేస్తున్న రామారావు తదితరులు

అనకాపల్లి: దేశవ్యాప్తంగా అన్ని రాష్ట్రాల్లో సుమారు 50 శాతం రిజర్వేషన్లు అమల్లో ఉండగా తమిళనాడులో అక్కడి ప్రభుత్వం బీసీ జనాభా ఆధారంగా 69 శాతం రిజర్వేషన్లు కల్పించిందని, మన రాష్ట్రంలో బీసీలకు ప్రభుత్వం పెద్ద పీట వేస్తుందని ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ అన్నారు. శ్రీలక్ష్మీ గ్రాండ్ ఫంక్షన్ హాల్లో జిల్లా యాదవ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఈ ఏడాది పది, ఇంటర్‌లో ఉత్తమ ఫలితాలు సాధించిన యాదవ విద్యార్థులకు ఆయన ప్రతిభా పురస్కారాలు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జనాభా విభజనకు అనుగుణంగా రిజర్వేషన్లు పెంపొందించే అవకాశాలను ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు పరిశీలిస్తున్నట్లు తెలిపారు. ఉత్తరాంధ్ర సుజల స్రవంతి, పోలవరం పూర్తి అయితే ఈ ప్రాంత సాగు విస్తీర్ణం పెరుగుతుందన్నారు. అనంతరం 200 మంది విద్యార్థులకు రూ. 5 వేలు, రూ. 3 వేలు, రూ. వెయ్యి చొప్పున నగదుతో పాటు, విద్యా సామగ్రి కలిపి ప్రతిభా పురస్కారాలు అందజేశారు. కార్యక్రమంలో జిల్లా యాదవ సంఘం అధ్యక్షుడు బర్నికాన సాయినాథరావు, అఖిల భారత యాదవ సంఘం అధ్యక్షుడు బర్నికాన రామారావు, రాష్ట్ర నాయకులు భర్నికాన నర్సింహమూర్తి, కరక సోమునాయుడు, ఎస్.శ్రీనివాసరావు, దేవర సత్యనారాయణ, దూళి రంగనాయుడు, బంధం వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

వరద బాధితులకు వస్త్రాలు, సరకుల సరఫరా


వ్యాన్ ద్వారా దుస్తులు, నిత్యావసర సరకులు పంపిస్తున్న రోటరీ క్లబ్ సభ్యులు

అనకాపల్లి: స్థానిక రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో విజయవాడ వరద బాధితులకు పట్టణ ప్రజల సహకారంతో సుమారు 1500 చీరలు, తువ్వాళ్లు, నైటీలు, లుంగీలు, దుప్పట్లు, 500 నిత్యావసర సరకుల కిట్లను ఆదివారం వ్యాన్ ద్వారా విజయవాడకు పంపించారు. ఈ సందర్భంగా క్లబ్ అధ్యక్షుడు సరిపల్లి రాజేష్ మాట్లాడుతూ వరద బాధితుల సహాయార్థం సుమారుగా రూ.6 లక్షల విలువైన వస్త్రాలు, సరకులు పంపించినట్టు తెలిపారు. కార్యక్రమంలో క్లబ్ ప్రొగ్రాం చైర్మన్ బుద్ధ రమణాజీ, సభ్యులు కడిమిశెట్టి సతీష్, రాజేష్‌నాయుడు, కె.ఎల్.ఎస్.కుమార్, సోమసుందర్, పి.చందు పాల్గొన్నారు.

గ్రామస్తులు, రైతులు అప్రమత్తంగా ఉండాలి


గవరపేటలో శారదా నదిని పరిశీలిస్తున్న తహసీల్దార్ సత్యనారాయణ

కశింకోట: రైవాడ జలాశయం నీరు విడిచి పెడుతున్నందున శారదానది పరీవాహక ప్రాంతంలో ఉన్న గ్రామస్తులు, రైతులు అప్రమత్తంగా ఉండాలని తహసీల్దార్ జి.సత్యనారాయణ కోరారు. కశింకోట గవరపేటలో నది ప్రవాహ పరిస్థితిని ఎంపీడీవో వి.వి.రవికుమార్‌తో కలిసి ఆదివారం సాయంత్రం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా అక్కడి రైతులు, ప్రజలతో మాట్లాడుతూ రైతులు నది అవతల తమ పశువులను సురక్షిత ప్రాంతాలకు తరలించాలని, లోతట్టు ప్రాంత ప్రజలు నీటి ముంపునకు గురి కాకుండా ఎగువ ప్రాంతాలకు వెళ్లాలని సూచించారు.

జమీలు కుటుంబానికి అండగా ఉంటాం

మాజీ ఎమ్మెల్యే పెట్ల ఉమా శంకర్‌గణేష్


జమీలు విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే గణేష్

నాతవరం: దివంగత నేత అంకంరెడ్డి జమీలు కుటుంబ సభ్యులకు వైఎస్సార్‌సీపీ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని, తాను కూడా అన్ని విధాలుగా సహకారం అందిస్తానని మాజీ ఎమ్మెల్యే పెట్ల ఉమా శంకర్ గణేష్ అన్నారు. నాతవరంలో అంకంరెడ్డి జమీలు ద్వితీయ వర్ధంతి సందర్భంగా విగ్రహానికి పూలమాల వేసి ఘన నివాళులర్పించారు. ఆయన మాట్లాడుతూ జమీలు లేని లోటు పూడ్చలేనిదన్నారు. 2019లో తాను ఎమ్మెల్యేగా విజయం సాధించడంలో అందించిన సహకారం ఎప్పుడూ గుర్తుంటుందన్నారు. మండలంలోని స్థానిక సంస్థల ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ అభ్యర్థుల గెలుపునకు విశేష కృషి చేశారన్నారు. అనంతరం జమీలు భార్య, డీసీసీబీ మాజీ డైరెక్టరు అంకంరెడ్డి పార్వతి, కుమార్తె వైద్యాధికారి సౌమ్య, ఉప సర్పంచ్ కరక అప్పలరాజు, ఎంపీటీసీ సభ్యురాలు కరక రేణుకలకు మనోధైర్యం కల్పించారు. ఎంపీపీ సాగిన లక్ష్మణమూర్తి, జెడ్పీటీసీ సభ్యురాలు కాపారపు అప్పలనర్స, వైస్ ఎంపీపీ పైల సునీల్ పాల్గొన్నారు.

వెల్లువెత్తిన వాన

- పొంగిపొర్లుతున్న వాగులు, గెడ్డలు
- నీట మునిగిన వరి పొలాలు
- ఆందోళన వ్యక్తం చేస్తున్న రైతులు
- స్తంభించిన జన జీవనం


శంకరం వద్ద ముంపునకు గురైన వరిపొలాలను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ



(ఇన్‌సెట్‌లో) కశింకోట వద్ద నీటి మట్టం పెరిగి ప్రవహిస్తున్న శారదా నది
రేబాక-మార్టూరు గ్రామాల మధ్య ఉధృతంగా పారుతున్న గెడ్డ

తుమ్మపాల: ఏకధాటిగా రెండు రోజులుగా జిల్లాలో కురుస్తున్న వర్షాలకు వాగులు, గెడ్డలు పొంగిపొర్లుతున్నాయి. చెరువులు నిండుకుండల్లా తయారయ్యాయి. కొండలు, ఎగువ ప్రాంతాల నుంచి వర్షపు నీరు గెడ్డలు, వాగుల ద్వారా దిగువ ప్రాంతాలకు పారుతోంది. జలాశయాలు పూర్తిగా నీటితో నిండిపోయాయి. అనకాపల్లి పట్టణంలో శారదా నది ఉధృతంగా పారుతోంది. సమీప గ్రామాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచిస్తున్నారు. వర్షాల ప్రభావంతో జన జీవనం స్తంభించింది. వరి పొలాలు పూర్తిగా నీటి ముంపునకు గురైనందున రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

ముంపు ప్రాంతాల్లో ఎమ్మెల్యే పర్యటన..

తుమ్మపాల మండలంలోని శంకరంలో ఏలేరు కాలువను ఆనుకుని ముంపునకు గురైన వరిపొలాలు, పులి కాలువ, ఉధృతంగా పారుతున్న ఏలేరు కాలువను ఆదివారం ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పదిహేనేళ్లుగా కాలువల్లో పూడికతీత పనులు చేపట్టకపోవడంతోనే నీరు నిలిచిపోయి వరిపొలాలు ముంపునకు గురవుతున్నాయన్నారు. మండలంలో అధిక శాతం వరి పంట పొలాలు నీటమునిగాయని, రైతులు తీవ్రంగా నష్టపోయారని చెప్పారు. ముంపుపై సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్, ఎమ్మెల్యేలు, అధికారులతో వీడియో కాన్ఫరెన్‌లో మాట్లాడారన్నారు. భారీ వర్షంపై అందరూ అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారన్నారు. ఈ మేరకు ముంపు ప్రాంతాల్లో పర్యటిస్తున్నట్లు తెలిపారు. అధిక వర్షపాతంతో ఎగువ ప్రాంతాల నుంచి నీరు వచ్చి మండలంలోని శంకరం, రేబాక పొలాల్లో నిలిచిపోయిందని, అనకాపల్లి-ఆనందపురం, అనకాపల్లి-విశాఖ జాతీయ రహదారుల వద్ద కాలువల లోతు తగ్గించి నిర్మించడంతో తక్కువ మోతాదులో మాత్రమే కాలువల ద్వారా పారుతోందన్నారు. తక్షణమే 12 కానాల వద్ద కాలువల్లో పూడిక తీస్తే నీరంతా దిగువకు పోయే అవకాశముందని చెప్పారు. కాలువలు పూర్తిగా దెబ్బతిన్నాయని, సాగు నీటి కాలువల అభివృద్ధిపై పూర్తిగా దృష్టి పెడతామన్నారు. రానున్న వేసవిలో కాలువల్లో పూడిక తీసి ముంపు సమస్యలు లేకుండా చేస్తామన్నారు. తుమ్మపాల ఎంపీటీసీ చదరం నాగేశ్వరరావు, గ్రామ నాయకులు పీలా విశ్వేశ్వరరావు, బొండా లక్ష్మీనారాయణ, పీలా తాతునాయుడు రైతులు పాల్గొన్నారు.

భారీ వర్షాలకు మండలంలోని తొమ్మిది గ్రామాల్లో వరి పొలాలు ముంపునకు గురయ్యాయి

గ్రామం	ముంపునకు గురైన పొలాలు(ఎకరాల్లో)	నష్టపోయిన రైతులు
ఏలేరు	70	130
సీతానగరం	07	20
కుంచంగి	20	15
తుమ్మపాల	20	30
శంకరం	135	160
రేబాక	40	60
సీహెచ్ఎన్ అగ్రహారం	2.5	05
అనకాపల్లి నార్త్-2	32	45
అనకాపల్లి సౌత్-2	100	120
మొత్తం	426.5	58.5

ఖరీఫ్ వరినాట్లకు మేలు

కశింకోట: మండలంలో రెండు రోజులుగా వర్షం దంచి కొడుతోంది. బంగాళాఖాతంలో వాయుగుండం ప్రభావంతో శనివారం రాత్రి నుంచి ప్రారంభమైన వర్షం ఆదివారం కొనసాగింది. ఉదయం 8.30 గంటల వరకు 43.2 మిల్లీ మీటర్లు, అప్పటి నుంచి సాయంత్రం వరకు 40.6 మిల్లీ మీటర్ల వంతున వర్షం కురిసినట్లు స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద వర్షపాతం నమోదైంది. వర్షాలు ఖరీఫ్ వరి నాట్లకు బాగా ఉపకరిస్తుందని, చీడ పీడలు పోగలవని రైతులు పేర్కొంటున్నారు. వర్షాల వల్ల కశింకోట ప్రాంతంలో శారదానది నీటిమట్టం పెరిగి ప్రవహిస్తోంది. ఈ నీరు నది పరివాహక ప్రాంతాల్లోని పంట భూముల్లో ఇంకా మిగిలి ఉన్న వరి నాట్లు పూర్తి కావడానికి, నాట్లు, చెరకు పంటలకు ఉపయోగపడనుందని రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ఇంకా వర్షాలు ఎక్కువైతే వరి నాట్లు నీట మునిగి నష్టపోయే పరిస్థితి కూడా ఉంటుందని ఒకింత ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.


వరిపొలాల్లో నిలిచిన వర్షపు నీరు


కశింకోటలో కురుస్తున్న వర్షం

డెయిరీ సభ్య రైతులకు దుప్పట్ల పంపిణీ


దుప్పట్లు పంపిణీ చేస్తున్న పెదనాయుడు, అయ్యప్పనాయుడు

దేవరాపల్లి: తెనుగుపూడి విశాఖ డెయిరీ పాల సమీకరణ కేంద్రంలో సభ్య రైతులకు దుప్పట్లు పంపిణీ చేశారు. విశాఖ డెయిరీ సరఫరా చేసిన దుప్పట్లను స్థానిక పాల సొసైటీ అధ్యక్షుడు అయ్యప్పనాయుడు, ఉప సర్పంచ్ కాటిపాం పెదనాయుడు పాడి రైతులకు అందజేశారు. స్థానిక పాల సొసైటీ వేతన కార్యదర్శి పి. శ్రీను, వారాది గౌరినాయుడు, గురువు నాయుడు, గంటా రాము, చామంతుల చిన్న తదితరులు పాల్గొన్నారు.